క్లుప్తంగా

శాకంబరీదేవిగా అమ్మవారు



గుడివాడ టౌన్: స్థానిక నాగవరప్పాడు వాసవీనగర్‌లోని శ్రీ కనక దుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని శుక్రవారం శాకంబరీ దేవిగా అలంకరించారు. ఏకాదశి అనంతరం వచ్చిన శుక్రవారం అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించడం ఇక్కడ ఆనవాయితీ అన్నారు. అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించడం వలన పాడిపంటలు పెరుగుతాయని అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉంటారని ఆలయ పండితులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



పామర్రు: మేడిశెట్టి వీర వసంతరావు, వీర రాఘవమ్మల ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు నిర్వాహకులు మేడిశెట్టి జగన్‌మోహన్‌రావు, నాగేంద్రరావు సౌజన్యంతో విద్యార్థులకు విద్యోపకరణాలను శుక్రవారం పంపిణీ చేశారు. మండలంలోని జమీదగ్గుమిల్లి హైస్కూల్ పరిధిలోని ఆర్‌హెచ్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఉపకరణాలను ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 పద్మవాణి, ఉపాధ్యాయులు విజయరాణి, కౌంతి అంకరవి, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

చెరువులా మారిన గురజాడ అండర్‌పాస్



పమిడిముక్కల: విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై గురజాడ అండర్‌పాస్ వద్ద వర్షం నీరు నిలిచి చెరువులా మారింది. ఈ ప్రాంతం పల్లంగా ఉండటంతో నీరు పోయేందుకు మార్గం లేక రోజుల తరబడి నిలిచి ఉంటోంది. అండర్‌పాస్ దాటేందుకు వాహనదారులు, గురజాడ ప్రజలు అవస్థలు పడుతున్నారు. గురజాడ ప్రజలు అండర్‌పాస్ దాటి అవతలివైపున ఉన్న పొలాలకు, ఎస్సీ కాలనీకి వెళ్లాల్సి ఉంది. నీరు నిల్వలేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గౌరీశంకర స్వామి హుండీ ఆదాయం రూ. 3.38 లక్షలు



గుడివాడ టౌన్: స్థానిక గౌరీశంకరపురంలోని శ్రీ గౌరీశంకర స్వామి వారి దేవస్థానం హుండీ కానుకల శుక్రవారం లెక్కించారు. దేవాలయానికి చెందిన నాలుగు ఉప ఆలయాలకు సంబంధించిన హుండీలు లెక్కించగా రూ. 3,38,652 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు. గడచిన 120 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకల మొత్తం అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం ఈఓ వి.డి. దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

ఫౌండేషన్ తరఫున విద్యార్థిని ఫీజు చెల్లింపు



పామర్రు: మండలంలోని పెదమద్దాలి శివారు కొండాయపాలెం గ్రామానికి చెందిన తంటిపూడి రాజేష్ ప్రమాదవశాత్తు ఇటీవల మరణించాడు. అదే గ్రామానికి చెందిన మనం–వనం ఫౌండేషన్ అధినేత పీ శ్రీనివాసరావు(పీఎస్ఆర్) స్పందించి మృతుడి కుమార్తె చదువుకు అయ్యే ఖర్చును ఫౌండేషన్ తరఫున భరిస్తామని వాగ్దానం చేశారు. మృతుడి కుమార్తె ప్రస్తుతం పామర్రులోని శ్రీనివాసా స్కూల్లో ఐదో తరగతి చదువుతోంది. ఫౌండేషన్ అధినేత విద్యార్థిని స్కూల్ ఫీజు కింద రూ.21 వేల చెక్కును పాఠశాల ప్రిన్సిపల్‌కు శుక్రవారం అందజేశారు.

పేదరికం చదువుకు అడ్డుకాదు

ట్రిపుల్ ఐటీలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినుల ప్రతిభ



ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు (ఫైల్)

కైకలూరు: పేదరికం చదువుకు అడ్డుకాదని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు నిరూపిస్తున్నారు. 2019 నుంచి 2024 వరకూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యకు అత్యధిక ప్రాధాన్యం కల్పించారు. బోధనలో నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. విద్యార్థుల భవితకు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ట్రిపుల్ ఐటీలు దివిటీలుగా మారాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ట్రిపుల్ ఐటీల్లో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీ చేసుకునే అవకాశం ఉంది. అనంతరం మంచి ప్యాకేజీలతో మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. కైకలూరు నియోజకవర్గం నాలుగు మండలాల్లో ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీల సీట్లు సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి మంచి మార్కులు సాధించిన వారికి 92.99 శాతం, ప్రైవేటు పాఠశాలలో చదివి బీపీఎల్‌కు దిగువున ఉన్నవారికి 7.01 శాతం సీట్లు కేటాయిస్తున్నారు. ఇలా నియోజకవర్గంలో ఏడుగురు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు సీట్లు సాధించడం విశేషం

సివిల్స్ నా లక్ష్యం



ఈ ఫొటోలో విద్యార్థిని పేరు జి.హేమశ్రీ. మండవల్లి మండలం కానుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఏప్రిల్ 2024 సంవత్సరంలో పదో తరగతి చదివి, 575 మార్కులు సాధించి, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. తండ్రి జి.శ్రీ కృష్ణ వ్యవసాయదారుడు. తల్లి వెంకటేశ్వరమ్మ గృహిణి. కష్టపడి చదివి సివిల్స్ రాస్తానని హేమశ్రీ చెప్పింది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధిస్తా



ఈ ఫొటోలో విద్యార్థిని పేరు మరడాని సాయిశ్రీ. మండవల్లి హైస్కూల్లో ఏప్రిల్, 2024లో 578 సాధించి శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీ సీటు దక్కించుకుంది. తండ్రి వెంకటఅప్పారావు సీఆర్పీగా పుట్లచెరువు హైస్కూల్లో విధులు నిర్వహిస్తున్నాడు. తల్లి గృహిణి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేయడం తన ఆశయమని సాయిశ్రీ చెప్పింది.

ఐఏఎస్ కావాలనుకుంటున్నా



ఈ చిత్రంలో విద్యార్థిని పేరు కుకునూరి నవ్య శ్రావణి. తండ్రి మురళీకృష్ణ కారు డ్రైవర్, తల్లి వరలక్ష్మి గృహిణి. భుజబలపట్నం హైస్కూల్లో పదో తరగతి చదివి 578 మార్కులు సాధించి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఐఏఎస్ సాధించి పేదలకు సేవ చేస్తానని శ్రావణి చెప్పింది.

కలెక్టర్ కావాలనే కల నెరవేర్చుకుంటా..



ఈ చిత్రంలోని విద్యార్థిని పేరు రాజులపూడి లలిత. కైకలూరు నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో చదివింది. పది పరీక్షల్లో 580 సాధించి మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో టాపర్‌గా నిలిచింది. ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. తండ్రి సుబ్బారావు కార్పెంటర్. తల్లి వెంకటేశ్వరమ్మ గృహిణి. పేదరికాన్ని జయించి ఉత్తమ మార్కులు సాధించింది. సివిల్స్ రాసి కలెక్టరు కావాలనే తన కల నేరవేర్చుకుంటానని చెప్పింది.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలని..



ఈ ఫొటోలోని విద్యార్థిని ముదినేపల్లి మండలం శ్రీహరిపురం శివారు ఐనంపూడి గ్రామానికి చెందిన పామిరెడ్డి దీక్షిత. తండ్రి శ్రీనివాస రెడ్డి రైతు. తల్లి భాగ్యలక్ష్మి అంగన్‌వాడీ టీచర్. వడాలి జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదివి 583 మార్కులు సాధించింది. ఈ మార్కులతో ఈ ఏడాది నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడతానని పేర్కొంది

వాయుసేనలో ఉద్యోగాలకు దరఖాస్తు చేయండి

కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): భారత వాయుసేనలో అగ్నివీర్ పథకం ద్వారా ఉద్యోగాల నియామకం కోసం యువత మక్కువ చూపాలని కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాబోయే కాలంలో భారతదేశాన్ని అత్యంత శక్తివంతమైన దేశాల్లో ఒకటిగా మార్చాలంటే యువతే కీలకమన్నారు. ఈ ఉద్యోగాలకు 2004 జూలై నుంచి 2008 జనవరి మధ్య జన్మించిన స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఫిజిక్స్, మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో, ఇంటర్మీడియట్‌లో ఒకేషనల్ లేక పాలిటెక్నిక్ కోర్సుల్లో కనీసం 50 శాతం మార్కులతో పాసై ఉండాలన్నారు. ఈ నెల 28వ తేదీలోగా ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అక్టోబరు 10వ తేదీ నుంచి ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

కావూరి శ్రీధర్‌కు వ్యాసమహర్షి పురస్కారం



గుడివాడ టౌన్: గుడివాడ మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ హిందీ ఉపాధ్యాయుడు కావూరి శ్రీధర్‌కు వ్యాస మహర్షి పురస్కారం లభించినట్లు ఆయన శుక్రవారం తెలిపారు. ఈ నెల 21వ తేదీన కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రంలో ఈ పురస్కారాన్ని అందుకోనున్నట్లు పేర్కొన్నారు. హిందూ ఉపాధ్యాయ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో ఈ పురస్కారం అందినట్లు తెలిపారు.

రోడ్డును బాగుచేయరూ..



కుదరవల్లి చెట్ల వద్ద ప్రమాదాలకు నిలయంగా మారిన గుంత



గుంతలమయంగా మారిన ఎరికపాడు రోడ్డు

నందివాడ: మండలంలోని కుదరవల్లి చెట్ల వద్ద నుంచి ఎల్ఎస్‌పురం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారింది. కొన్ని రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు చేరింది. దీంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులకు గుంత దాటడం నరకప్రాయంగా మారింది. గుంతలో ఎటువైపు వెళ్తే ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఈ గుంతల్లో పడి పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతలు పూడ్చాలని అధికారులకు మొరపెట్టినా పట్టించుకున్న వారే కరువయ్యారని పరిసర ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్‌బీ అధికారులు గుంతలపై దృష్టిసారించి రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

గోతులను పూడ్చండి

గుడివాడ టౌన్: స్థానిక పెద ఎరికపాడులోని ప్రధాన రహదారులు గోతులమయమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా గోతుల్లో నీరు నిలవడంతో వాహనాలు గోతుల్లోకి వెళ్లి ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రివేళ ప్రమాదాలు అధికంగా ఉంటున్నాయని, తక్షణమే అధికారులు స్పందించి కనీస మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.

లైంగిక దాడిపై కేసు నమోదు

గుడ్లవల్లేరు: పాలు పోయించుకునేందుకు బాలికను ఇంటికి రమ్మని పిలిచిన పాల వ్యాపారి ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ జి.సత్యనారాయణ కథనం మేరకు.. గుడ్లవల్లేరు మండలం చంద్రాల గ్రామానికి చెందిన 55 ఏళ్ల మరీదు అరుణకుమార్ పాల వ్యాపారం చేస్తుంటాడు. ఈనెల ఒకటో తేదీన అదే గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థినిని పాల కోసం ఇంటికి రమ్మని పిలిచాడు. ఇంటికి వచ్చిన బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. గడచిన 20 రోజులుగా బాలికను వేధింపులకు గురిచేస్తున్నాడు. నిందితుడు స్థానికుడు కావటంతో బాధితురాలి కుటుంబ సభ్యులు ఉపేక్షించారు. గురువారం సాయంత్రం కూడా అరుణ్‌కుమార్ బాలికను వెంబడించాడు. దీంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

గంజాయి సప్లై చేస్తున్న వ్యక్తి అరెస్ట్

పామర్రు: గంజాయిని సప్లై చేస్తున్న కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు పామర్రు సీఐ వీ సుభాకర్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మే 23వ తేదీన స్థానిక జగపతి ప్లాట్స్ వద్ద కొంత మంది అనుమానంగా తిరుగుతున్నారనే సమాచారంతో పామర్రు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అక్కడకు వెళ్లారని తెలిపారు. అక్కడ ఉన్న ఆరుగురు వ్యక్తుల వద్ద గంజాయి ఉండటంతో వారిని కస్టడీలోకి తీసుకుని, గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరి మీద పామర్రు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై విచారణ చేపట్టి ఆ ఆరుగురు వ్యక్తులను రిమాండ్‌కు పంపించామన్నారు. కేసు విచారణ లో వారికి గంజాయ సప్‌లై చేసిన వారు, వారి వద్ద కొనుగోలు చేసిన వారు మరొక ముగ్గురు ఉన్నట్లు తేలిందన్నారు. వారిలో ఒక వ్యక్తి అయిన షేక్ హమీద్ బాషాను బల్లిపర్రు నుంచి పెదమద్దాలి వెళ్లే మార్గంలో అరెస్టు చేసినట్లు తెలిపారు. అతడి వద్ద ఉన్న 50 గ్రాముల గంజాయిని మధ్యవర్తుల సమక్షంలో సీజ్ చేసి అతడ్ని గుడివాడ కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ల బహూకరణ

భావదేవరపల్లి(నాగాయలంక): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు దాతలు మూడు కంప్యూటర్లను శుక్రవారం బహూకరించారు. గ్రామానికి చెందిన దాతలు చందు సత్యనారాయణ, సుబ్బారావు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. స్వగ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలకు లక్షరూపాయల విలువైన మూడు కంప్యూటర్లను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా హెచ్‌ఎం ఆకుల జ్యోతిరమ్మయికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగ, వ్యాపారాల రీత్యా దూర ప్రాంతాల్లో స్థిరపడినవారు జన్మిచ్చిన గ్రామానికి సాయం చేయడం అభినందనీయమన్నారు. గ్రామాల్లో ఇలాంటి సాయం అందిస్తే విద్యార్థులకు, ప్రజలకు విస్తృత మేలు కలుగుతుందన్నారు. దాతలు మాట్లాడుతూ మరో రెండునెలల్లో పాఠశాల విద్యార్థుల కోసం సైకిల్ షెడ్ నిర్మిస్తామని ప్రకటించారు. దాతలను పాఠశాల తరపున ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, ఎంఈఓ–1 టీవీఎం రామదాసు, ఎంఈఓ–2 ఎ.రామారావు, టీడీపీ నేత మెండు లక్ష్మణరావు, పీఎంసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు

డీఎంహెచ్‌ఓ గీతాబాయి



కూచిపూడిలో స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

కూచిపూడి(మొవ్వ): జిల్లాలో లింగ నిర్ధారణ ఎంపిక నిషేధ చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జి.గీతాబాయి పేర్కొన్నారు. మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీదేవి నర్సింగ్ హోమ్‌లోని స్కానింగ్ కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాలకు సంబంధించి అన్ని అనుమతులు ఉండాలన్నారు. గర్భిణుల అనుమతులు తీసుకుని మాత్రమే స్కానింగ్ చేయాలని, ఫారం–ఎఫ్‌ను ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలు నమోదు చేయాలన్నారు. ఎక్కడైనా లింగ నిర్ధారణ చేయుచున్నట్లు సమాచారం తెలిపినా.. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య, విద్యా బోధకులు బి.రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

పూడుకుపోతున్న పామర్రు డ్రెయిన్



డెక్కతో పేరుకుపోయిన పామర్రు డ్రెయిన్

పామర్రు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి లంకకాలువ వరకూ సుమారు రెండున్నర కిలోమీటర్లు ఉన్న ఈ మురుగు డ్రెయిన్ కొంత కాలంగా పూడుకుపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పామర్రులోని 13 నుంచి 20 వార్డులలోని వారు వాడుకున్న మురుగునీరు ఈ డ్రెయిన్ ద్వారా ప్రవహించి లంక కాలువలో కలవాలి. డ్రెయినేజీలో గుర్రపుడెక్క, జమ్మి తదితర వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు దిగువకు ప్రవహించడం లేదు. దీంతో ఆయా వార్డులలోని మురుగునీరు అక్కడే నిల్వ ఉండిపోతోంది. దీంతో స్థానికులు పలు అవస్థలు పడుతున్నారు. ఇంతే కాకుండా డ్రెయినేజీ చెత్తతో పూడుకు పోవడంతో మురుగునీరు పేరుకుపోయింది. రెండు సంవత్సరాల క్రితం అప్పటి అధికారులు స్పందించి డ్రెయినేజీలోని మురుగును తొలగించడమే కాకుండా గట్లపై ఉన్న ఆక్రమణలను డ్రెయినేజీ అడ్డంకులను తొలగించారు. ఆ తర్వాత మళ్లీ ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆక్రమణలు పెరిగిపోయాయి. అదేవిధంగా డ్రెయినేజీలో డెక్క, చెత్త చెదారాలతో పూడుకుపోయింది. అప్పటి నుంచి నేటి వరకూ ఎవరూ పట్టించుకోక పోవడంతో డ్రెయినేజీలో మురుగు పేరుకుపోతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్త, గుర్రపు డెక్క, జమ్మిలను తొలగించి మురుగు నీరు దిగువకు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రజక సంఘ కార్యవర్గం ఎంపిక



కార్యవర్గ తీర్మానాన్ని పంచాయతీ అధికారికి అందజేస్తున్న సంఘ సభ్యులు

ముదినేపల్లి రూరల్: మండల రజక సంఘం కార్యవర్గ ఎంపిక ముదినేపల్లిలో శుక్రవారం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు యలకుర్తి నాగరాజు ఆధ్వర్యంలో పలువురు సభ్యులు నూతన కార్యవర్గ సభ్యులను ఎంపిక చేసుకున్నారు. సంఘ ఉపాధ్యక్షులుగా మీసాల సత్యనారాయణ, రాజమండ్రి శ్రీనివాసరావు, కార్యదర్శిగా రావులపాటి వెంకటసుబ్బారావు, జాయింట్ సెక్రటరీలుగా మాడెం శ్రీను, నిడుమోలు హనుమంతరావు, ట్రెజరర్‌గా మల్లంపల్లి కొండలరావును సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శికి అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు మీసాల సత్యనారాయణ మాట్లాడుతూ రజకులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు సంఘం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

వీడని వాన



కైకలూరు మండలం గోనెపాడు జాతీయ రహదారిపైకి వచ్చిన వర్షం నీరు

కైకలూరు: మండలంలో కురుస్తున్న వర్షాలు జనజీవనాన్ని స్తంభిజేస్తున్నాయి. కైకలూరులో గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు వర్షం కురుస్తూనే ఉంది. వేదజల్లే విధానంలో వరి సాగు చేస్తున్న రైతులకు కంటిమీద కునుకు ఉండటం లేదు. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడిందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ఈ గండాన్ని గట్టెక్కడం ఎలా అని రైతులు ఆలోచనలో పడ్డారు. వర్షాలకు సమీప ప్రాంతాల నుంచి కొల్లేరు డ్రెయిన్లకు భారీగా నీరు చేరుతోంది. మరో రెండు రోజుల్లో లోతట్టు ప్రాంతాలకు వర్షపు నీరు చేరే అవకాశం ఉంది. ప్రస్తుతానికి కొల్లేరుకు నీటిని తరలించే పెదఎడ్లగాడి వంతెన వద్ద సాధారణ స్థితిలోనే నీటి మట్టం ఉందని డ్రెయినేజీ ఏఈఈ ఇందిర తెలిపారు.

కైకలూరు జలమయం..

ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో కైకలూరు జలమయంగా మారింది. లోతట్టు ప్రాంతాలన్నీ నీటముగిగాయి. ప్రధానంగా వెలంపేట కాలనీ జలదిగ్బంధంలో చిక్కుకుంది. కైకలూరు జాతీయ రహదారిలో అనేక ప్రాంతాల్లో రహదారులపైకి నీరు చేరింది. కైకలూరు టౌన్ హాలు, రైల్వేస్టేషన్ రోడ్, కొత్త పెట్రోల్ బాంకు ఎదుట, వైఎస్సార్ గ్రీన్ విలేజ్‌లో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. కైకలూరులో శుక్రవారం 43.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల నేపథ్యంలో పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. తహసీల్దారు పోతురాజు వర్షాలు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

న్యాయవాదులకు సత్కారం



న్యాయవాదులను సత్కరించిన బార్ అసోసియేషన్ సభ్యులు

గుడివాడ టౌన్: గుడివాడ బార్ అసోసియేషన్‌కు చెందిన ఇరువురు న్యాయవాదులను స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంతో శుక్రవారం ఘనంగా సత్కరించారు. గుడివాడ బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది జి. శివప్రసాద్ లడక్ లోని ఎత్తైన ప్రదేశం వద్దకు బైక్‌పై వెళ్లి విజయవంతంగా యాత్ర ముగించుకుని వచ్చిన సందర్భంగా, గ్లోబల్ ఫౌండేషన్ ద్వారా జాతీయ స్థాయిలో బంగారు నంది అవార్డు అందుకున్న జి.రాధాకృష్ణమూర్తిని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు ఇంతటి ప్రతిభను ప్రదర్శించడం అభినందనీయం అని న్యాయవాదులు అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మహ్మద్ రఫీ, చోరగుడి కుటుంబరావు, సీహెచ్. సూర్య, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల కోసం కొలతల సేకరణ



ఇంటి కొలతలు వేస్తున్న పంచాయతీ, సచివాలయ అధికారులు

కోడూరు: మండలంలోని 13 పంచాయతీల పరిధిలో హౌస్ ట్యాక్స్ (ఇంటి పన్ను) ప్యూరిఫికేషన్ ప్రక్రియ వేగంగా సాగుతోంది. సచివాలయ, పంచాయతీ అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి సంబంధిత ఇళ్లకు సంబంధించిన కొలతలు, యజమాని వివరాలను నమోదు చేసుకుంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ప్యూరిఫికేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు. వీటి ఆధారంగా ఇంటి పన్నును నమోదు చేయడంతో పాటు గతంలో ఇంటి పన్నుల్లో కొన్ని మార్పులు, చేర్పులు చేయనున్నట్లు చెప్పారు. వర్షంలో కూడా ఈ ప్రక్రియను అధికారులు నిర్వహిస్తున్నారు.

గణపేశ్వరం దుర్గమ్మకు ఆషాఢ సారె



గణపేశ్వరం(నాగాయలంక): ఆషాఢ మాసం పురస్కరించుకుని మండలంలోని గణపేశ్వరంలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం పలు గ్రామాల భక్తులు ఆధ్వర్యంలో ఆషాఢ సారె సమర్పించారు. ఆలయ ధర్మకర్త మండలి శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు), అరుణ దంపతులు పర్యవేక్షణలో రేమాలవారిపాలెం, దిండి, బర్రంకుల గ్రామాల నుంచి తరలివచ్చిన మహిళలు, భక్తులు ఆలయంలోని నిలువెత్తు దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని ఆలయ అర్చకుడు పోతుకూచి సత్యనారాయణశాస్త్రి నేతృత్వంలో గ్రామాల నుంచి తెచ్చిన ఆషాఢ సారెను సంప్రదాయబద్ధంగా సమర్పించారు. భక్త సమాజాల సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

మక్కాయాత్రకు బయలుదేరిన ముస్లింలు

మచిలీపట్నంటౌన్: సౌదీలోని పవిత్ర మక్కా యాత్రకు కృష్ణా జిల్లా మచిలీపట్నం నుంచి 70 మంది ముస్లిం యాత్రికులు శుక్రవారం బయలుదేరారు. స్థానిక జవారుపేట దర్గా ఆవరణ వద్ద నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. శనివారం తెల్లవారుజామున ప్రత్యేక విమానంలో వీరంతా వెళ్లనున్నారు. మక్కాలో 12 రోజుల పాటు వీరంతా ఉమ్రా చేయనున్నారు. మక్కాయాత్రకు వెళ్లే ముస్లింలు జుమా నమాజ్ చేసిన అనంతరం టేక్యా లోని షాషా కలందర్ బాబా ఆశీస్సులు కోసం దర్శించుకున్నారు. దీంతో ఈ ప్రాంతంలో పండగ వాతావరణం నెలకొంది. మక్కా యాత్రకు బయలుదేరిన ముస్లింలను మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా పూలదండలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగి రావాలని ఆయన ఆకాంక్షించారు.